జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 38 16-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.




## భారత్ 'రుద్ర' రూపం

పాకిస్తాన్‌పై మరో విజయం

61 పరుగులతో టీమిండియా గెలుపు

ఇషాన్ కిషన్ మెరుపు బ్యాటింగ్

'సూపర్8'కు భారత్ అర్హత

'విక్రమార్కుడు మళ్లీ వెనక్కి వెళ్లి ఆ శవాన్ని భుజాన వేసుకొని మళ్లీ నడక సాగించాడు... చందమామ కథలో బేతాళ ప్రశ్నకు విక్రమార్కుడు సరైన సమాధానం ఇవ్వగానే బేతాళుడు మళ్లీ చెట్టెక్కటం... 'బేతాళ పంచ విశతి'లో మళ్లీ మళ్లీ ఇదే దృశ్యం, ఇదే సంవాదం... భారత్, పాకిస్తాన్ మధ్య వరల్డ్ కప్‌లో మ్యాచ్ అంటే దీనికి సరిగ్గా సరిపోతుంది!

2లో



## విశాఖ తీరంలో నౌకల పండగ..

70 యుద్ధ నౌకలు.. 50 దేశాల అతిథులు..

విశాఖలో IFR-2026 ఘన ఆరంభం

మిలాన్, IONS సమ్మేళనంతో సముద్ర శక్తి ప్రదర్శన

రాష్ట్రపతి సమీక్ష, ఆర్‌కే బీచ్‌లో సిటీ పరేడ్

## నేనే సీఎం, నేనే మున్సిపల్

# మంత్రిని అని చెప్పా

- నేనే రాజు, నేనే మంత్రి అన్న వ్యాఖ్యలపై సీఎం రేవంత్ క్లారిటీ
- మున్సిపల్ ఎన్నికల్లో గెలుపోటములకు నాదే బాధ్యత అని చెప్పా
- కొందరికి ఇది అర్థమైనా స్వీకరించే గొప్ప మనసు వాళ్లకు లేదు
- 90 శాతం ఫలితాలు మాకు అనుకూలంగా వచ్చాయి. -సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానం , ప్రభుత్వ లక్ష్యాలపై స్పష్టమైన ప్రకటన చేశారు. తాను ఎప్పుడూ పాలకుడిగా ప్రవర్తించలేదని, కేవలం సేవకుడిగానే బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని ఆయన పునరుద్ఘాటించారు. "నేనే రాజు.. నేనే మంత్రి" అంటూ తాను గతంలో చేసిన వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలను తిప్పికొడుతూ, ఆ మాటలకు అసలు అర్థం బాధ్యత స్వీకరించడమేనని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల గెలుపోటములకు తానే బాధ్యత వహిస్తానని ప్రకటించిన నేపథ్యంలో, ప్రజలు 90 శాతం ఫలితాలను కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఇచ్చారని, ఇది తన పనితనానికి ప్రజలు ఇచ్చిన గీటురాయి అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొందరు ఈ విజయాన్ని జీర్ణించుకోలేక ప్రజల తీర్పును అవమానిస్తున్నారని, కానీ పేదలు తనపై ఉంచిన నమ్మకమే ఈ విజయానికి మూలమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



## ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ 5 ప్రశ్నలు

అమెరికా వాణిజ్య ఒప్పందంపై మోదీ సర్కార్‌పై రాహుల్ దాడి

ఈ ఒప్పందం రైతులకు ద్రోహం చేయడమేనని ఆరోపణ

జీఎం పంటలు, సోయా, పాల రంగాలపై ప్రభావంపై ఆందోళన

భారత వ్యవసాయంపై అమెరికా పట్టు సాధిస్తుందని హెచ్చరిక

2లో



## రైతులకు పూర్తి రక్షణ... రాహుల్ గాంధీ తప్పుదోవపట్టిస్తున్నాడు

యూఎస్, ఈయూ వాణిజ్య ఒప్పందాలపై కాంగ్రెస్ ఆరోపణలు ఖండించిన అమిత్ షా

రైతు, పాడి, మత్స్య రంగాలకు పూర్తి రక్షణ కల్పించామని వెల్లడి

యూపీఏ, ఎన్డీయే వ్యవసాయ బడ్జెట్లను పోల్చిన హోంమంత్రి

విషయంపై చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి బహిరంగ సవాల్



## పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ప్రతి ఒక్కరు పని చేయాలి..

- జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం..
- రూ. 2 కోట్ల విరాళం ఇచ్చి తొలి సభ్యత్వాన్ని తీసుకున్న పవన్ కళ్యాణ్..
- పార్టీ సిద్ధాంతాలకి ఆకర్షితులను చేసి సభ్యత్వ నమోదు చేయాలి: డిప్యూటీ సీఎం పవన్

2లో

# ఏపీలో బిల్ గేట్స్ పర్యటన

- సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌తో కీలక అంశాలపై గేట్స్ చర్చలు
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సహకారంపై ప్రధానంగా దృష్టి
- ఆర్‌టీజీఎస్ కేంద్రం, ఉండవల్లి పొలాలను సందర్శించనున్న బిల్ గేట్స్
- గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్టును విస్తరించనున్న ప్రభుత్వం



మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపక అధినేత బిల్ గేట్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కీలక రంగాల్లో భాగస్వామ్యంపై చర్చించేందుకు ఆయన తన బృందంతో కలిసి ఏపీకి వస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లతో సమావేశమవుతారు. ఆదివారం అందిన సమాచారం ప్రకారం, సోమవారం ఉదయం 10 గంటలకు బిల్ గేట్స్ సచివాలయానికి చేరుకుంటారు. ముందుగా రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించి, పాలనలో సాంకేతికత వినియోగాన్ని పరిశీలిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులు, అధికారులతో బిల్ గేట్స్ బృందం సమావేశమవుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఇప్పటికే అమలవుతున్న ప్రాజెక్టులను మరింతగా విస్తరించడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చిస్తారు.



2లో

## హంగ్ మున్సిపాలిటీల కోసం కాంగ్రెస్ అరాచకం: కేటీఆర్

- కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తున్నారంటూ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్
- 34 మున్సిపాలిటీల్లో అధికారం కోసం కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతోందంటూ విమర్శలు
- కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తూ, ప్రలోభాలకు గురిచేస్తోందని కేటీఆర్ ఆరోపణ
- సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసమే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు

## పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ప్రతి ఒక్కరు పని చేయాలి..

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈరోజు (ఫిబ్రవరి 15న) ఉదయం డిప్యూటీ సీఎం, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదుకు రూ.2 కోట్లు విరాళం అందించి, తొలి సభ్యత్వాన్ని తీసుకున్నారు. పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకొని, పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసేందుకు ఎవరైతే ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వం తీసుకుంటారో వారిని "ఉద్యమి"గా, పార్టీ పోరాటానికి మరింత బలాన్ని అందించి, నవతరంలో ప్రేరణ కలిగించి పార్టీ సిద్ధాంతాలకి ఆకర్షితులను చేసి సభ్యత్వ నమోదు చేసేవారిని "సాధక్"గా, జనసేన పార్టీ చేస్తున్న ప్రజా, రాజకీయ పోరాటానికి పరోక్షంగా తమ వంతు సమయాన్ని, ఆర్థిక, సాంకేతిక, సేవా, మేథా సహాయ సహకారాలు అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసేవారిని "ప్రదాత"గా ఇక నుంచి పిలుస్తామని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. అయితే, 150 మందితో పార్టీని ప్రారంభించాం.. 2021లో మొదటి విడత క్రియాశీలక సభ్యత్వం ప్రారంభించినప్పుడు 90 వేలు నమోదు చేశామని ఉప ముఖ్యమంత్రి పవన్ పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ఆ సంఖ్య ఆరు లక్షలకు చేరింది.. ఎన్నికల తర్వాత 12.98 లక్షల సభ్యత్వాలు సాధించాం.. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారి నుంచి కూలి పనులు చేసుకునే వారు, చదువుకున్న వారు ఎంతో మంది ఈ ప్రక్రియలో భాగస్వాములు అయ్యారని చెప్పారు. పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకొని, పార్టీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేవారు మనకు ముఖ్యం.. అలాంటి వారే పార్టీకి అవసరం అన్నారు.

## విశాఖ తీరంలో నౌకల పండగ..

విశాఖపట్నం సాగరతీరం మరోసారి అంతర్జాతీయ స్థాయిలో వార్తల్లో నిలుస్తోంది. భారత నౌకాదళం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష' (×ఖీ=-2026) ఆదివారం నాడు వైభవంగా ప్రారంభమైంది. దేశ చరిత్రలో మూడోసారి నిర్వహిస్తున్న ఈ మెగా ఈవెంట్‌కు విశాఖపట్నం రెండోసారి వేదిక కావడం విశేషం. సరిగ్గా దశాబ్దం క్రితం, అంటే 2016లో ఇక్కడ జరిగిన ఐఎఫ్ఆర్ తర్వాత మళ్ళీ 2026లో అదే నగరాన్ని ఎంపిక చేయడం ద్వారా విశాఖ ప్రాధాన్యతను నౌకాదళం మరోసారి చాటిచెప్పింది. నేటి నుండి ఫిబ్రవరి 25వ తేదీ వరకు పది రోజుల పాటు సాగే ఈ వేడుకల్లో సుమారు 50 దేశాల నుండి 4000 మంది అతిథులు , 70కి పైగా అత్యాధునిక యుద్ధనౌకలు పాల్గొంటున్నాయి. ఈ పది రోజులు విశాఖ నగరం ధవళ వస్త్రధారులైన నేవీ సిబ్బందితో , యుద్ధనౌకల వెలుగులతో ధగధగలాడిపోనుంది. ఏడాది ఉత్సవాలు కేవలం నౌకాదళ సమీక్షకే పరిమితం కాకుండా, మూడు ప్రధాన కార్యక్రమాల సమాహారంగా సాగనున్నాయి. ఐఎఫ్ఆర్‌తో పాటు ప్రతి రెండేళ్లకోసారి జరిగే 'మిలాన్' మల్టీ లాటరల్ నేవల్ ఎక్సర్‌సైజెస్ , 'ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం' (×ాచీూ) కూడా ఇక్కడే నిర్వహిస్తున్నారు. దీనివల్ల హిందూ మహాసముద్ర పరివాహక దేశాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిత్రదేశాలతో సముద్ర భద్రత , పరస్పర సహకారంపై కీలక చర్చలు జరగనున్నాయి. ఆదివారం సాయంత్రం 'మిలాన్' పేరుతో ఒక ప్రత్యేక గ్రామాన్ని ప్రారంభించడంతో ఈ ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ గ్రామంలో భారతదేశంలోని అన్ని రాష్ట్రాల సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు, ఇది విదేశీ అతిథులకు మన సంస్కృతిని పరిచయం చేసే 'మినీ ఇండియా'లా కనిపిస్తోంది. ఈ పది రోజుల షెడ్యూల్‌లో కొన్ని ఘట్టాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఫిబ్రవరి 18న భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము యుద్ధనౌకలను సమీక్షించనుండగా, ఫిబ్రవరి 19న ఆర్కే బీచ్‌లో నిర్వహించే 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్' అత్యంత వైభవంగా జరగనుంది. ఈ పరేడ్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు సముద్ర గర్భంలో జరగబోయే యుద్ధ విన్యాసాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేయనున్నాయి. గతంలో అండమాన్‌కే పరిమితమైన 'మిలాన్' విన్యాసాలను, మెరుగైన మౌలిక వసతుల దృష్ట్యా ఇప్పుడు విశాఖకు మార్చడం ఇక్కడి పర్యాటక రంగానికి కూడా ఊతాన్నిస్తోంది. మన నౌకాదళ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పడమే కాకుండా, వివిధ దేశాల యుద్ధనౌకలు , జలాంతర్గాములను అతి సమీపంగా చూసే అరుదైన అవకాశం ఈ ఉత్సవాల ద్వారా ప్రజలకు దక్కుతోంది.

## ఏపీలో బిల్ గేట్స్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

'స్వర్ణాంధ్ర విజన్-2047' లక్ష్యాల సాధనకు చేపట్టిన సంస్కరణలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య, మెడ్‌టెక్, సంజీవని వంటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్ గేట్స్‌కు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ముఖ్యంగా, గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న 'సంజీవని' ప్రాజెక్టు పనితీరును ప్రభుత్వం ఆయనకు ప్రత్యేకంగా వివరించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సమావేశాల అనంతరం, బిల్ గేట్స్ బృందం అమరావతిలోని ఉండవల్లి సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తుంది. అక్కడ డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహాయంతో చేపడుతున్న ఆధునిక వ్యవసాయ పద్ధతులను పరిశీలించనుంది.

## ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ 5 ప్రశ్నలు

భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, మోదీ ప్రభుత్వంపై తన దాడిని మరింత తీవ్రతరం చేశారు. ఈ ఒప్పందం భారత రైతులకు చేసిన ద్రోహమని ఆరోపిస్తూ, ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రధాని నరేంద్ర మోదీకి ఐదు సూటి ప్రశ్నలు సంధించారు. ఈ వివాదాస్పద ఒప్పందంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వాణిజ్య ఒప్పందం వల్ల జన్యుపరంగా మార్పు చేసిన (జీఎం) పంటలు, సోయా రైతులపై పడే ప్రతికూల ప్రభావాల గురించి రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో రైతులకు అందుబాటులో ఉన్న రక్షణ కవచాలను కేంద్ర ప్రభుత్వం తొలగిస్తోందని ఆరోపించారు. ఈ ఒప్పందం కేవలం నేటి సమస్య కాదని, భవిష్యత్తులో భారత వ్యవసాయ వ్యవస్థపై మరో దేశానికి దీర్ఘకాలికంగా పట్టును అప్పగించడమేనని ఆయన విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ, ప్రధాని మోదీ సమాధానం చెప్పాలంటూ రాహుల్ గాంధీ ఈ ఐదు ప్రశ్నలను లేవనెత్తారు.

# భారత్ 'రుద్ర' రూపం




కొలంబో: టి20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌పై భారత్ తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. ఇప్పటి వరకు 71తో పైచేయి ఉండగా ఇప్పుడు ఎనిమిదోసారి పాక్‌ను విశ్వవేదికపై మట్టికరిపించింది. భారత్ ముందు పాక్ ఏమాత్రం నిలవలేకపోవడంతో ఊహించిన ఫలితమే వచ్చింది. ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో భారత్ 61 పరుగుల తేడాతో పాకిస్తాను చిత్తు చేసింది. టి20ల్లో పాక్‌పై భారత్‌కు ఇదే అతి పెద్ద విజయం. టాస్ గెలిచి పాకిస్తాన్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాన్ కిషన్ (40 బంతుల్లో 77; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగగా, సూర్యకుమార్ యాదవ్ (29 బంతుల్లో 32; 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. పాక్ బౌలర్లలో సయీమ్ అయూబ్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం పాకిస్తాన్ 18 ఓవర్లలో 114 పరుగులకే కుప్పకూలింది. ఉస్మాన్ ఖాన్ (34 బంతుల్లో 44; 6 ఫోర్లు, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. వరుసగా మూడో విజయంతో భారత్ 'సూపర్ ఎయిట్స్'కు అర్హత సాధించింది. అహ్మదాబాద్‌లో బుధవారం జరిగే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో భారత్ తలపడుతుంది. ఆసియా కప్ తరహాలోనే తమ నిర్ణయాన్ని కొనసాగిస్తూ ఈ మ్యాచ్‌లో కూడా పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘాకు భారత సారథి సూర్యకుమార్ 'షేక్ హ్యాండ్' ఇవ్వలేదు. భారత్ చేతిలో భారీ ఓటమితో పాకిస్తాన్ 'సూపర్8' అవకాశాలపై తీవ్ర ప్రభావం పడింది. బుధవారం నమీబియాతో జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్ తప్పనిసరిగా గెలిస్తేనే 'సూపర్8' దశకు అర్హత సాధిస్తుంది. పాకిస్తాన్ ఓడిపోతే అమెరికా 'సూపర్8'కు చేరుతుంది.

**అభిశేక్ మళ్లీ డకౌట్...**

పార్ట్ టైమ్ స్పిన్నర్ సల్మాన్ వేసిన తొలి ఓవర్లో వరుసగా మూడు బంతులు పరుగు తీయలేకపోయిన అభిశేక్ శర్మ (0) తర్వాతి బంతికి భారీ షాట్‌కు ప్రయత్నించి వెనుదిరిగాడు. టోర్నీలో అతనికి ఇది వరుసగా రెండో డకౌట్. అయితే ఇషాన్ చెలరేగిపోవడంతో జట్టు దూసుకుపోయింది. షాహీన్ అఫ్రిది ఓవర్లో వరుసగా 6, 4 కొట్టిన అతను అబ్రార్ ఓవర్లోనూ 6, 4 కొట్టాడు. పవర్‌ప్లేలో భారత్ 52 పరుగులు చేసింది. అబ్రార్ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు కొట్టిన ఇషాన్ 27 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత కూడా దూకుడుగా ఆడిన ఇషాన్‌ను ఎట్టకేలకు 9వ ఓవర్లో పాక్ అవుట్ చేయగలిగింది. ఆ సమయంలో భారత్ స్కోరు 88 అయితే ఇషాన్ ఒక్కడే 76 బాదడం విశేషం! మరోవైపు తిలక్ వర్మ (24 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్) ఇన్నింగ్స్ కాస్త తడబడుతూనే సాగింది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ అతను ఒకే స్కోరు (25) చేశాడు. తిలక్, పాండ్యా (0)లను అయూబ్ వరుస బంతుల్లో అవుట్ చేశాడు. ఈ దశలో సూర్య, శివమ్ దూబే (17 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా పిచ్ అనుకూలంగా లేకపోవడంతో జాగ్రత్తగా ఆడారు. ఐదో వికెట్‌కు వీరిద్దరు 38 పరుగులు జోడించేందుకు 34 బంతులు పట్టాయి. అఫ్రిది వేసిన చివరి ఓవర్లో దూబే, రింకూ సింగ్ (11 నాటౌట్) కలిసి 2 ఫోర్లు, సిక్స్‌తో 16 పరుగులు రాబట్టారు. భిన్నమైన యాక్షన్‌తో తీవ్ర చర్చను రేకెత్తించిన ఉస్మాన్ తారిఖ్ (1/24) 2 ఫోర్లు మాత్రమే ఇచ్చి అందరికంటే మెరుగైన బౌలింగ్ ప్రదర్శన చేశాడు.

## నేనే సీఎం, నేనే మున్సిపల్ మంత్రిని అని చెప్పా

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక న్యాయం , దళితుల సాధికారతపై ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని నమ్మించి మోసం చేసిన వారికి భిన్నంగా, నేడు అదే దళితుడిని అసెంబ్లీ స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టామని గుర్తు చేశారు. ఒకప్పుడు దళితులు రాష్ట్రాన్ని నడపలేరని హేళన చేసిన వారే, నేడు అదే దళితుడిని 'అధ్యక్షా' అని పిలిచి మైక్ అడిగే పరిస్థితిని తాము కల్పించామని, ఇది అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన గొప్ప అవకాశమని కొనియాడారు. ప్రభుత్వంలో ఎస్సీ వర్గాలకు 30 శాతం ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, నలుగురు మంత్రులకు అవకాశం ఇచ్చామని చెప్పారు. 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యను తాము పరిష్కరించడం వల్లే, నేడు బుడగ జంగాల వంటి వెనుకబడిన వర్గాలకు ఎంబీబీఎస్ సీట్లు అందుతున్నాయని, ఈ మార్పు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆయన ఆకాంక్షించారు. రాబోయే 20 ఏళ్లు కూడా తాను పేదల కోసమే పని చేస్తానని, ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు తన సేవలు కొనసాగుతాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు. పరిపాలనలో డాక్టర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్ అధికారులుగా పేదల పిల్లలను చూడాలన్నదే తన కల అని, అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సిద్ధిస్తుందని అభిప్రాయపడ్డారు. గెలిచినప్పుడు విర్రవీగడం, ఓడిపోయినప్పుడు కుంగిపోవడం తన నైజం కాదని, 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ ప్రజలకు దూరంగా లేనని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో తనపై బాధ్యత మరింత పెరిగిందని, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు అంకితభావంతో పనిచేస్తానని రేవంత్ రెడ్డి ఈ సభ ద్వారా ఉద్ఘాటించారు.





## హంగ్ మున్సిపాలిటీల కోసం కాంగ్రెస్ అరాచకం: కేటీఆర్

రాష్ట్రంలో ఇటీవల ఎన్నికలు జరిగిన మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడిన 34 చోట్ల అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. కౌన్సిలర్లను కిడ్నాప్ చేయడం, ప్రలోభ పెట్టడం, ఇళ్లకు పోలీసులను పంపడం, గూండాలను ఉపయోగించడం వంటి చర్యలకు దిగుతోందని ఆయన విమర్శించారు.దఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నిక జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే సీపీఐకి మద్దతిస్తున్నట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను దోచుకోవడంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ భాగస్వాములేనని, సంస్థకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సీపీఐకి అనుబంధంగా ఉన్న ఏఐటీయూసీ కూడా కాంగ్రెస్‌తో పొత్తును ఎలా అంగీకరించిందో అర్థం కావడం లేదని, దీని వెనుక ఎలాంటి ఒత్తిళ్లు ఉన్నాయో తెలియదన్నారు.

## రైతులకు పూర్తి రక్షణ... రాహుల్ గాంధీ తప్పుదోవపట్టిస్తున్నాడు: అమిత్ షా

అమెరికా, యూరోపియన్ యూనియన్‌లతో భారత్ ఇటీవల కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశంలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా ఖండించారు. రైతుల విషయంలో కాంగ్రెస్, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ అబద్ధాలు ప్రచారం చేస్తూ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఒప్పందంలోనూ వ్యవసాయం, పాడి, మత్స్య రంగాల ప్రయోజనాలకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గాంధీనగర్‌లో దేశంలోనే తొలి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటులో నిలబడి రాహుల్ గాంధీ రైతుల ప్రయోజనాలను కాపాడతామని మాట్లాడటం నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడంలో కాంగ్రెస్‌కు సుదీర్ఘ



చరిత్ర ఉందని, ఇప్పుడు వాణిజ్య ఒప్పందాల గురించి అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరిగిన ప్రతి చర్చలోనూ రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి హాని కలగకుండా సంపూర్ణ భద్రత కల్పించారని హామీ ఇచ్చారు. గత యూపీఏ ప్రభుత్వంతో పోలుస్తూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేసిన మేలును అమిత్ షా వివరించారు. మన్మోహన్ సింగ్ హయాంలో కేవలం రూ. 26,000 కోట్లుగా ఉన్న వ్యవసాయ బడ్జెట్, ప్రధాని మోదీ నాయకత్వంలో రూ. 1,29,000 కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. గత దశాబ్ద కాలంలో కనీస మద్దతు ధరకు ఆహార ధాన్యాల సేకరణ పదిహేను రెట్లు పెరిగిందని తెలిపారు. "70 ఏళ్లుగా కాంగ్రెస్ రుణమాఫీ గురించి మాట్లాడిందే తప్ప చేసిందేమీ లేదు. కానీ మా ప్రభుత్వం, రైతులు అప్పులపాలు కాకుండా ఉండేందుకు ఏటా రూ. 6,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది" అని ఆయన అన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ పాడి రంగం దెబ్బతింటుందన్న విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. ప్రభుత్వం పాడి ఉత్పత్తి రంగాన్ని బలహీనపరచలేదని, మరింత బలోపేతం చేసిందని స్పష్టం చేశారు. అన్ని ఒప్పందాలలోనూ పాడి రంగానికి పూర్తి రక్షణ కల్పించామని పేర్కొన్నారు. ఈ అంశంపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు కూడా ఈ చర్చకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.



## మున్సిపల్ కొలువుకు అంతా సిద్ధం

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి: భాస్కర్ రావు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన అదనపు కలెక్టర్

**యాదాద్రి భువనగిరి భువనగిరి, ఫిబ్రవరి 15 (తొలివెలుగు):** భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు సమగ్రంగా పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఎన్నికల కేంద్రాన్ని, సమావేశ మందిరాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా మున్సిపల్ కమిషనర్ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికలు ముగిసేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామలింగం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారమే యూరియా విక్రయించాలి

- వ్యవసాయ అధికారి ఏజాజ్ అలీఖాన్



**రామన్నపేట, ఫిబ్రవరి 15 (తొలివెలుగు):** రామన్నపేట మండల పరిధిలో యూరియా ఎరువుల విక్రయాలకు సంబంధించి డీలర్లు తప్పనిసరిగా ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు పాటించాలని వ్యవసాయ అధికారి ఏజాజ్ అలీఖాన్ స్పష్టం చేశారు. మండలంలో యూరియా స్టాక్‌ను స్వీకరించిన డీలర్లు సోమవారం ఉదయం 10 గంటల తర్వాత మాత్రమే రైతులకు బుకింగ్‌కు అవకాశం కల్పించాలని ఆదేశించారు. ఉదయం 10 గంటల లోపు ఎలాంటి బుకింగ్‌లు చేపట్టరాదని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ప్రతి ఫర్టిలైజర్ డీలర్ తప్పనిసరిగా అనుసరించాలన్నారు. అదేవిధంగా, ఆదివారం రోజున స్టాక్‌ను స్వీకరించినట్లయితే సోమవారం ఉదయం 10 గంటల తర్వాత మాత్రమే బుకింగ్‌లు ప్రారంభించాలి. ఉదయం 10 గంటల తర్వాత స్టాక్‌ను స్వీకరించిన డీలర్లు మధ్యాహ్నం 3 గంటల తర్వాత మాత్రమే రైతులకు బుకింగ్ సదుపాయం కల్పించాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, పారదర్శకంగా యూరియా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని అన్ని ఎరువుల డీలర్లు ఈ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## అజ్ఞాత వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

- జాతీయ రహదారిపై చిట్యాల వద్ద ప్రమాదం
- మృతుడు రితీష్ రెడ్డిగా గుర్తింపు

**చిట్యాల, ఫిబ్రవరి 15 (తొలివెలుగు):** గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం చిట్యాల పట్టణ శివారులోని 65వ నంబరు జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. రితీష్ రెడ్డి (40) అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనం (టీజీ 09డీ6769)పై బాపట్ల నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన అపరిచిత వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రితీష్ రెడ్డి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మృతునికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.



# సేవాలాల్ మార్గం అనుసరణీయం



- పుట్టగూడెంలో ఘనంగా జయంతి వేడుకలు
- పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



**రాజాపేట, ఫిబ్రవరి 15 (తొలివెలుగు):** రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామంలో బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతులు, భజనలు నిర్వహించి భక్తులు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంత్ సేవాలాల్ సమాజాభివృద్ధి కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన మహానుభావుడని కొనియాడారు. ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లు పెంపొందించుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన బోధించారని గుర్తు చేశారు. సమాజ పురోగతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సేవాలాల్ చూపిన మార్గంలో ముందుకు సాగితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం సేవాలాల్ జయంతి వేడుకల నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. గ్రామ సర్పంచ్ రాంజీ నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ బంజారా సమాజంలో జ్ఞానజ్యోతిని వెలిగించిన ఆధ్యాత్మిక గురువని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న బంజారా సమాజాన్ని ఏకం చేసి, అహింసా సిద్ధాంతాన్ని బోధించిన మహనీయుడని కొనియాడారు. బంజారాల సంస్కృతికి ఆధ్యాత్మికతను జోడించి, సమాజానికి దిశానిర్దేశం చేసిన మహాగురువని అభివర్ణించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి బుడిగె పెంటయ్య గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, ఆలేరు ఏఎంసీ మాజీ డైరెక్టర్ గుర్రం నరసింహులు, వివిధ పార్టీల నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జగాలనేలేటి జంగమా.. సంగెంలోని భీమలింగమా...



- భీమలింగేశ్వరుని ఆలయంలో భక్తుల కోలాహలం
- శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

**వలిగొండ, ఫిబ్రవరి 15 (తొలివెలుగు):** హిందువుల ముఖ్య పండుగలలో ఒకటైన మహా శివరాత్రిని వలిగొండ మండల వ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. "శివుని మహా రాత్రి"గా భావించే ఈ పవిత్ర దినాన భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి, జాగరణ చేస్తూ శివారాధనలో నిమగ్నమయ్యారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. మహా శివరాత్రి సందర్భంగా భీమలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తిజన సమూహాలతో కళకళలాడింది.

### మహా శివరాత్రి ప్రాముఖ్యత

పౌరాణిక కథనాల ప్రకారం ఈ రోజున పరమేశ్వరుడు పార్వతిదేవితో ఏకమయ్యారని విశ్వసిస్తారు. ఈ కలయిక పురుష, స్త్రీ శక్తుల సమన్వయానికి ప్రతీకగా భావించబడుతుంది. ఉపవాసం, జాగరణ, రుద్రాభిషేకం, లింగార్చన వంటి ఆచారాల ద్వారా భక్తులు ఆత్మశుద్ధి, ఆధ్యాత్మిక మేల్కొలుపు సాధించాలని సంకల్పిస్తారు.

### ఘనంగా పార్వతీ కళ్యాణం

సంగెం గ్రామంలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. గ్రామం నుంచి త్రివేణి సంగమం వరకు శివపార్వతుల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పార్వతీ కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించగా, గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తి గీతాలు, హారతులు, శివనామస్మరణలతో వాతావరణం ఆధ్యాత్మిక పరవశంతో నిండిపోయింది. భీమలింగేశ్వరుని ఆశీస్సులు అందరికీ కలగాలని భక్తులు ప్రార్థించారు.





## నేడు చౌటుప్పల్ మున్సిపల్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- మధ్యాహ్నం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

**చౌటుప్పల్, ఫిబ్రవరి 15 ( తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ నూతన పాలకవర్గం సోమవారం అధికారికంగా కొలువుదీరనుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్న ప్రమాణ స్వీకారోత్సవం, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఆర్డీవో శేఖర్ రెడ్డి పర్యవేక్షణలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సజావుగా సాగేందుకు పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సాఫీగా సాగేందుకు అవసరమైన భద్రతా, పరిపాలనా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

## శివరాత్రి సందర్భంగా గోదావరి తీరంలో స్వచ్ఛంద సంస్థల సేవా కార్యక్రమాలు

**మంచిర్యాల( తొలివెలుగు):** శివరాత్రి సందర్భంగా మంచిర్యాల గోదావరి తీరంలోని గౌతమేశ్వరాలయం, గోదావరి తీరమంతా శివనామ స్మరణతో మార్మోగింది. తెల్లవారుజాము నుంచే మంచిర్యాల నుండే కాకుండా ఇతర ప్రాంతాలనుండి పెద్ద ఎత్తున భక్తులు నది స్నానం అచరించి గౌతమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్నానానికి విచ్చేసిన భక్తులకు వివిధ స్వచ్ఛంద సంస్థలు రకరకాల సౌకర్యాలు అందించారు. మంచిర్యాల ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు ఉప్మా అల్పాహారం అందజేశారు. గత 33 సంవత్సరాలుగా గోదావరి తీరంలో ఆర్యవైశ్య సేవాసమితి ఆధ్వర్యంలో వైశ్యులు ఉప్మా అందజేయడం జరుగుతుంది అలాగే వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మంచినీరు, యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ మంచినీరు అందజేశారు. మార్వాడి సమాజ్ ఆధ్వర్యంలో సిరా పూరి అల్పాహారం అందజేశారు.





# సమర్థవంతంగా నిర్వహించేందుకు అదనపు చర్యలు తీసుకోవాలి

**ఆసిఫాబాద్, (తొలివెలుగు)** వాంకిడి మండల కేంద్రంలోని చిక్లి నది తీరాన వెలసిన శివకేశవాలయం ప్రాంగణం మహాశివరాత్రి జాతర సందడితో ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. కాకతీయులు కాలంలో నిర్మించబడిన ఈ చారిత్రక దేవాలయం శిల్పకళా వైభవానికి ప్రతీకగా నిలుస్తూ శతాబ్దాల చరిత్రను తనలో దాచుకుని ఉంది. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ నిర్వహించే జాతర జిల్లాతో పాటు పొరుగు ప్రాంతాల భక్తులను కూడా ఆకర్షిస్తుంది. ఈ సంవత్సరం కూడా మూడు రోజుల పాటు జరగనున్న జాతరకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయ ప్రధాన ద్వారాల వద్ద బారులు తీరిన భక్తులు "ఓం నమశ్శివాయ" నినాదాలతో భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ప్రత్యేక అభిషేకాలు, రుద్రహోమాలు, లింగార్చనలు, రాత్రి జాగరణ కార్యక్రమాలు ఘనంగా కొనసాగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అయితే జాతర ప్రాంగణంలో కొన్ని సమస్యలు భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ప్రాంగణం మొత్తం దుమ్ముతో నిండిపోవడం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు,పడ్డారు. దుమ్ము తగ్గించేందుకు తరచుగా నీటిని చల్లే ఏర్పాట్లు చేయాలని భక్తులు సూచిస్తున్నారు. అలాగే తగినంత నీడ లేకపోవడంతో మధ్యాహ్న సమయంలో వేడి తీవ్రంగా ఉండటంతో దర్శనం కోసం వేచి ఉన్నవారికి కష్టాలు ఎదురవుతున్నాయి. తాగునీటి సదుపాయాలు కొన్ని చోట్ల మాత్రమే ఉండటంతో పొడవాటి క్యూలలో నిలబడాల్సి వస్తోందని భక్తులు వాపోతున్నారు. అదనపు వాటర్ ట్యాంకులు, మొబైల్ వాటర్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే తాత్కాలిక మరుగుదొడ్ల సంఖ్య పెంచాలని, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. భద్రతా పరంగా కూడా మరింత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. భారీ రద్దీ నేపథ్యంలో పోలీసు బలగాలను పెంచి ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక బృందాలను నియమిస్తే రాకపోకలు సులభతరం అవుతాయని సూచిస్తున్నారు. పార్కింగ్ స్థలాలను విస్తరించి, వాహనాల క్రమబద్ధీకరణపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అత్యవసర పరిస్థితుల కోసం వైద్యశిబిరాలు, అంబులెన్స్ సదుపాయం అందుబాటులో ఉన్నప్పటికీ, ఉంచితే మరింత భద్రత కలుగుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జాతర ప్రాంగణంలో అనుమతులు లేని దుకాణాలు, అసంగత కార్యకలాపాలపై పర్యవేక్షణ అవసరమని కొందరు సూచిస్తున్నారు. ధరల నియంత్రణ, నాణ్యమైన ప్రసాదాల విక్రయంపై చర్యలు తీసుకుంటే భక్తులకు మేలు జరుగుతుందని అంటున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఆధ్యాత్మిక మహోత్సవం భక్తులకు మరపురాని అనుభూతిని కలిగించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. చారిత్రక ప్రాధాన్యం గల ఈ జాతర రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందేలా సమగ్ర ప్రణాళికతో నిర్వహిస్తే మరింత ఆదర్శవంతంగా నిలుస్తుందని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. భక్తి, చరిత్ర, సాంస్కృతిక సంప్రదాయాల సమ్మేళనంగా నిలిచే ఈ మహాశివరాత్రి జాతర విజయవంతంగా సాగేందుకు అధికారులు అదనపు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# రాచకొండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- శైవ క్షేత్రాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- చారిత్రక వైభవాన్ని పునరుద్ధరిస్తాం: ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డి
- రాచకొండ శివాలయంలో ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు





**సంస్థాన్ నారాయణపూర్, ఫిబ్రవరి 15 (తొలివెలుగు) :** సంస్థాన్ నారాయణపూర్ మండలం రాచకొండ గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన రాచకొండ పర్యాటక ఉత్సవాలు, బ్రహ్మోత్సవాలు భక్తి పారవశ్యంతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన సతీమణి కోమటిరెడ్డి లక్ష్మీతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. చారిత్రక శివాలయంలో పంచామృతాలతో అభిషేకం చేసి, వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాచకొండ ప్రాంతానికి అపారమైన చారిత్రక, ఆధ్యాత్మిక వైభవం ఉందన్నారు. ఎన్నో దశాబ్దాల క్రితం రాచకొండ ఒక రాజ్యానికి రాజధానిగా వెలుగొందిందని, నాటి పాలకుల కాలంలో నిర్మితమైన దేవాలయాలు, కోట అవశేషాలు ఈ ప్రాంత



గౌరవప్రదమైన చరిత్రకు నిదర్శనాలని పేర్కొన్నారు. శైవ సంప్రదాయం విరాజిల్లిన ఈ నేలలో అనేక శివక్షేత్రాలు ఆధ్యాత్మిక చైతన్యాన్ని వ్యాప్తి చేశాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ చారిత్రక క్షేత్రాలకు తగిన గుర్తింపు రావాల్సిన అవసరం ఉందన్నారు. రాచకొండలో ఉన్న దేవాలయాల పునరుద్ధరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారి సౌకర్యాల విస్తరణ, పర్యాటకులకు అవసరమైన వసతుల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో రాచకొండను చారిత్రక – ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన శివపార్వతుల కల్యాణం, రథోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ఉత్సవాలను విజయవంతం చేశారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. రాచకొండ ప్రాంత ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పే దిశగా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# శివనామస్మరణం..! సర్వపాపాహరణం..!

- హర హర శంభో అంటూ మార్మోగిన శివాలయాలు
- పులిగిల్లలో అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణం

**వలిగొండ, ఫిబ్రవరి 15 (తొలివెలుగు):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వలిగొండ మండల వ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. "ఓం నమఃశివాయ", "హర హర శంభో" నినాదాలతో ఆలయ ప్రాంగణాలు మారుమోగాయి. వేకువజాము నుంచే భక్తులు బారులుదీరి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సంగెం గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. అదేవిధంగా రెడ్లరేపాక భవానీ శంకర స్వామి ఆలయం, పొదుటూరు, నర్సాపురం, సుంకిశాల, కంచనపల్లి గ్రామాల శివాలయాల్లో కూడా మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో శివపార్వతుల కళ్యాణాలు శాస్త్రోక్తంగా జరిపించారు. పులిగిల్ల గ్రామంలోని రాముని గుట్టపై వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి అనంతరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. శివరాత్రి జాగరణలో భాగంగా భక్తులు రాత్రి పొద్దుపోయే వరకు కళ్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉపసర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్, మాజీ సర్పంచ్ జక్క వెంకట్ రెడ్డి, నాగిళ్ల కృష్ణమూర్తి, కోమటిరెడ్డి ఇంద్రారెడ్డి, కళ్లెం సుదర్శన్ రెడ్డి, వరకంతం వెంకట్ రెడ్డి, కోలన్ సత్తిరెడ్డి, కోలన్ వెంకట్ రెడ్డి, పర్వతం రాజు, సిలువేరు మహేష్, బుగ్గ మనోజ్ కుమార్, వేముల నరసింహ, వేముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# భక్తి శ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు







- చౌటుప్పల్‌లో శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



**చౌటుప్పల్, ఫిబ్రవరి 15 (తొలివెలుగు):** మహాశివరాత్రి పర్వదినాన్ని చౌటుప్పల్ పట్టణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే శివాలయాలు భక్తులతో నిండిపోయి శివనామస్మరణతో మారుమోగాయి. అర్ధరాత్రి లింగోద్భవం వరకు భక్తులు బారులుదీరి శివయ్యకు అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. చిన్నకొండూరు రోడ్డులోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. భక్తులు సాంప్రదాయ దుస్తులతో స్వయంగా పరమశివుడికి పంచామృతాభిషేకాలు నిర్వహించి రుద్రాభిషేకం చేశారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య జరిగిన పూజలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత గంభీరంగా మార్చాయి. అనంతరం స్వామివారికి పూలమాలలతో విశేష అలంకరణ చేసి భజన సంకీర్తనలు గానం చేశారు. పల్లకి సేవను ఘనంగా నిర్వహించగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. దేవాలయ ప్రధాన అర్చకులు పెద్ది సుధాకర్ శర్మ, పెద్ది కిషోర్ శర్మ, రోహిత్ మిశ్రా పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణంలోని ఇతర శివాలయాల్లో కూడా మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి, జాగరణ నిర్వహిస్తూ పరమశివుడి ఆశీస్సులు పొందారు. మొత్తం మీద చౌటుప్పల్ పట్టణం భక్తి పారవశ్యంతో మునిగిపోయింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివారాధనలో పాల్గొన్నారు.



## పార్లమెంట్‌లో నమాజు చేస్తా.. కానీ వందేమాతరం పాడను"..

**ఎంపీ ఇమ్రాన్ సంచలన ప్రకటన..**

"నేను పార్లమెంట్‌లో నమాజు చేస్తాను కానీ వందేమాతరం మాత్ర పాడను" ఇది ఒక కాంగ్రెస్ ఎంపీ పార్లమెంట్ ఆవరణలో ఇచ్చిన స్టేట్‌మెంట్. భారత స్వాతంత్ర్యోద్యమంలో వందేమాతరం ప్రాధాన్యత గురించి అందరికీ తెలిసిందే. తాజాగా అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం వందేమాతరం ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం ఆదేశించడాన్ని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ తీవ్రంగా వ్యతిరేకించారు. 'వందే మాతరం' గీతం పాడే సమయంలో తప్పనిసరిగా అందరూ నిలబడాలన్న అంశంపై ఇమ్రాన్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. "వందే మాతరం ఇప్పటికే పాడుతున్నాం. కానీ అన్ని ఆరు చరణాలు చదవాలని చెబితే నేను చదవలేను. ఎందుకంటే నా మతం దానికి అనుమతించదు. నాకు ఇక్కడ(పార్లమెంట్) ఆవరణలో సజ్దా(ఇస్లామిక్ ప్రార్థన) చేయడంలో ఎలాంటి సమస్య లేదు. కానీ నా మతం ఏమి చెబుతుందో అది పాటించే స్వేచ్ఛను నాకు భారత రాజ్యాంగం ఇచ్చింది" ఎంపీ అని అన్నారు. ఇమ్రాన్ మసూద్ ప్రధానంగా రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను ప్రస్తావించారు. దేశానికి గౌరవం ఇవ్వడంలో తాను వెనుకాడనని, కానీ తన మత పరిమితులను దాటలేనని స్పష్టం చేశారు. ఈ అంశం ఇప్పుడు రాజకీయంగా మాత్రమే కాకుండా, సమాజంలో కూడా పెద్ద చర్చగా మారే అవకాశం కనిపిస్తోంది. మరోవైపుడ వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలనూ పాడాలంటూ జారీ చేసిన ఉత్తర్వులు ఏకపక్షం, నిర్హేతుకమని ప్రముఖ ముస్లిం సంస్థ జమీయత్ ఉలామా-ఏ-హింద్ వ్యాఖ్యానించింది. ఇది రాజ్యాంగం కల్పించిన మతస్వేచ్ఛపై దాడి అని జమీయత్ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదానీ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. "వందేమాతరం పాడకుండా ముస్లింలు ఎవరినీ నిరోధించరు. కానీ గేయంలోని కొన్ని చరణాలు మాతృభూమిని ఓ దేవతలా స్తుతించేలా ఉన్నాయి. ఇది ఇస్లాం లాంటి ఏకధర్మ మతాల ప్రాథమిక విశ్వాసానికి విరుద్ధం. ఆర్టికల్ 25తో పాటు సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక తీర్పులను ఇది ఉల్లంఘిస్తోంది. కేంద్రం ఆదేశాలు మైనార్టీల రాజ్యాంగ హక్కులను హరించే యత్నం" అని మౌలానా పేర్కొన్నారు.

## రష్యా చమురు కొనుగోలుపై జైశంకర్ క్లారిటీ..

భారత్ అమెరికా ట్రేడ్ డీల్ తర్వాత, భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు తగ్గించిందనే వార్తల నేపథ్యంలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. చమురు కొనుగోళ్లు రాజకీయ ఒత్తిడితో కాకుండా, ఖర్చులు, లభ్యత, ప్రమాదాలను బట్టి జరుగుతాయని ఆయన క్లారిటీ ఇచ్చారు. మ్యూనిక్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన జైశంకర్.. అమెరికాతో ట్రేడ్ డీల్ జరిగినా.. భారత వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి మారదని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలకు ముందు యూఎస్ విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో మాట్లాడుతూ.. భారత్ రష్యన్ ఆయిలు కొనుగోలు చేయబోవడం లేదని తమకు హామీ ఇచ్చిందని అన్నారు. ఈ వ్యాఖ్యల తర్వాత జైశంకర్ రష్యన్ చమురు విషయంలో స్పష్టత ఇచ్చారు. "భారత్ స్వయంగా నిర్ణయాలు తీసుకుంటుంది. మీ ఆలోచనతో కలవని నిర్ణయాలు తీసుకోవచ్చు" అని అన్నారు. వారం రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ.. భారత్ రష్యా చమురు కొనుగోళ్లు ఆపి, అమెరికా నుంచి ఎక్కువ కొనుగోళ్లు చేస్తామని అంగీకరించిందని ప్రకటించారు. ఇదిలా ఉంటే, భారత్ యూఎస్ ట్రేడ్ డీల్ తర్వాత రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మాట్లాడుతూ.. భారత్ ఎక్కడా కూడా రష్యన్ ఆయిల్ కొనుగోలును నిలిపేస్తున్నట్లు ప్రకటించలేదని అన్నారు.

## కెనడా, బ్రిటన్‌లకు చైనా 'వీసా' గిఫ్ట్.. 'ఫైవ్ ఐస్' కూటమిలో మిగిలింది అమెరికా మాత్రమే!

డ్రాగన్ దేశం రెండు దేశాలకు ప్రకటించిన బంపర్ ఆఫర్‌ను చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోతున్నాయి. ఇంతకీ చైనా ఏం చేసిందో తెలుసా.. కెనడా, బ్రిటన్ పౌరులకు వీసా లేకుండా వారి దేశంలోకి ఎంట్రీ కల్పిస్తుంది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆదివారం ఈ కొత్త విధానాన్ని ప్రకటించింది. మంత్రిత్వ శాఖ ప్రకారం.. ఈ నియమం ఫిబ్రవరి 17, మంగళవారం నుంచి అమల్లోకి వస్తుంది. ఇది ఈ ఏడాది చివరి వరకు అమలులో ఉంటుంది. కనడా, బ్రిటిష్ పాస్‌పోర్ట్ హోల్డర్లు ఇప్పుడు వీసా లేకుండా గరిష్టంగా 30 రోజులు చైనాలో ఉండగలరు. ఇక వారు వ్యాపారం, పర్యాటకం లేదా స్నేహితులు, కుటుంబ సభ్యులను కలవడానికి ఎలాంటి వీసా లేకుండా చైనాకు ప్రయాణించవచ్చు. కెనడియన్ ప్రధాన మంత్రి మార్క్ కార్నీ, బ్రిటిష్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ ఇటీవల చైనాను సందర్శించిన తర్వాత ఈ ప్రకటన రావడం విశేషం. ఈ పర్యటనల తర్వాత చైనా ఈ రెండు దేశాలతో సంబంధాలను మెరుగుపరచడం లక్ష్యంగా తాజాగా నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ది ఫైవ్ ఐస్ అనేది యునైటెడ్ స్టేట్స్, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లతో కూడిన గూఢచార భాగస్వామ్య సమూహం. ఇది పాశ్చాత్య దేశాలకు కీలకమైన భద్రతా కూటమిగా పరిగణించబడుతుంది. ఈ సమూహంలో చైనా వీసా రహిత ప్రయాణాన్ని మంజూరు చేయని ఏకైక దేశం ఇప్పుడు యునైటెడ్ స్టేట్స్. చైనా గతంలో జూలై 2024లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పౌరులకు వీసా-రహిత ప్రవేశాన్ని మంజూరు చేసింది. దీని ప్రకారం.. నాలుగు ఫైవ్ ఐస్ దేశాల పౌరులు (బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్) ఇప్పుడు 30 రోజుల వరకు వీసా లేకుండా చైనాకు ప్రయాణించవచ్చు. ఖచైనా తీసుకున్న తాజా నిర్ణయం కొన్ని పాశ్చాత్య దేశాలతో తన సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి చేస్తున్న దౌత్య ప్రయత్నాల్లో భాగమే నిపుణులు భావిస్తున్నారు. అయితే ఈ సౌకర్యం నుంచి అమెరికాను మినహాయించడం రెండు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలను కూడా ప్రతిబింబిస్తుందని సూచిస్తున్నారు. చైనా ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 75 దేశాల పౌరులకు వీసా రహిత ప్రవేశాన్ని మంజూరు చేసింది.

# టిప్పు సుల్తాన్ ఎప్పుడూ ప్రేమలేఖలు రాయలేదు".. మాలేగావ్ వివాదంపై ఓవైసీ..



మాలేగావ్‌లో "టిప్పు సుల్తాన్" ఫోటో వివాదం మహారాష్ట్రలో రాజకీయ దుమారానికి కారణమైంది. మాలేగావ్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో టిప్పు సుల్తాన్ ఫోటో ఉంచడం వివాదానికి కారణమైంది. దీనిపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. మరోవైపు, మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్ష్ వర్ధన్ సప్కల్ టిప్పు సుల్తాన్‌ను ఛత్రపతి శివాజీ మహారాజ్‌తో పోల్చడం వివాదాన్ని మరింత పెద్దది చేసింది.దఇదిలా ఉంటే, ఈ వివాదంపై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ స్పందించారు. టిప్పు సుల్తాన్‌ను ఓవైసీ అమరవీరుడిగా అభివర్ణించారు. కాంగ్రెస్ అధ్యక్షుడికి మద్దతు తెలియజేశారు. సప్కల్ వ్యాఖ్యలపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మండిపడ్డారు. ఈ వివాదం గురించి ఓవైసీ మాట్లాడుతూ.. "టిప్పు సుల్తాన్ బ్రిటీష్ వారితో పోరాడుతూ అమరుడయ్యారు. వీర్ సావర్కర్ చేసినట్లు ఆయన బ్రిటిష్ వారికి ప్రేమ లేఖలు రాయలేదు. క్షమాపణలను కోరలేదు. టిప్పు సుల్తాన్ తన కత్తిని తీసుకుని బ్రిటీస్ వారి నుంచి తన దేశాన్ని విముక్తి చేయాలని పోరాడుతూ మరణించాడు. బ్రిటీష్ వీరికి టిప్పు ఎప్పుడూ భయపడలేదు. టిప్పు శరీరం గంటన్నర పాటు పడి ఉన్న, బ్రిటీష్ వారు అతడి వద్దకు వెళ్లడానికి ధైర్యం చేయలేదు. టిప్పు వేలు నుంచి తొలగించిన ఉంగరంపై రామ్ అనే పదం ఉంది" అని అన్నారు. భారత్ వద్ద ఉన్న క్షిపణులు, రాకెట్ టెక్నాలజీ టిప్పు కలల్ని నిజం చేస్తున్నాయని అబ్దుల్ కలాం తన వింగ్ ఆఫ్ ఫైర్ లో రాశారు, ఇది అబద్ధమా..? అని ఓవైసీ ప్రశ్నించారు. మహాత్మా గాంధీ తన యంగ్ ఏజ్ మ్యాగజైన్‌లో టిప్పు సుల్తాన్ హిందూ-ముస్లిం ఐక్యతకు ఉదాహరణ అని రాశారు, దీనిని అబద్ధమని చెప్పగలరా? అని అడిగారు. అంతకుముందు, కాంగ్రెస్ అధ్యక్షుడు సప్కల్ మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ "స్వరాజ్య" అనే ఆలోచన కోసం ఎలా ప్రయత్నించారో, బ్రిటీష్ వారిపై యుద్ధానికి టిప్పు సుల్తాన్ అలాగే పిలుపునిచ్చారని అన్నారు. టిప్పు పోరాటం శివాజీ మహరాజ్ ఆదర్శాలకు అనుగుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. టిప్పు సుల్తాన్ ఒక యోధుడు, భారత పుత్రుడు అని అన్నారు. శివాజీతో సమానంగా టిప్పును మనం పరాక్రమానికి చిహ్నంగా చూడాలని అన్నారు.

## ప్రాణం తీసిన ఎలక్ట్రిక్ బెడ్.. విద్యుదాఘాతంతో 45 ఏళ్ల వ్యాపారవేత్త మృతి

కేశవ్‌పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని త్రి నగర్‌లో ఒక షాకింగ్ సంఘటన వెలుగుచూసింది. ఎలక్ట్రిక్ బెడ్ పై నిద్రిస్తున్న 45 ఏళ్ల వ్యక్తి విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు మద్యానికి బానిసయ్యాడని, ఉదయం నుంచి మద్యం సేవిస్తున్నాడని, మంచంలోనే విద్యుత్ షాక్ తగిలి మరణించాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. బెడ్ కు అనుసంధానించిన విద్యుత్ తీగ, విద్యుత్ సాకెట్ కూడా గుర్తించారు. ప్రమాదం తరువాత, క్రైమ్ సీన్ బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలించింది. విద్యుత్ మంచం నుండి విద్యుత్ షాక్ కారణంగా మరణించిన మొదటి కేసు ఇదే కావచ్చని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదం వాయువ్య ఢిల్లీ జిల్లాలోని త్రి నగర్‌లో జరిగింది. ఈ ప్రమాదం గురించి కేశవ్‌పురం పోలీస్ స్టేషన్‌కు ౹ాజ= కాల్ వచ్చింది. విద్యుత్ షాక్ కారణంగా తన సోదరుడు మరణించాడని కాల్ చేసిన వ్యక్తి తెలిపాడు. ధీరజ్ కౌశిక్ అనే వ్యక్తి గదిలోని ఎలక్ట్రిక్ బెడ్‌పై చనిపోయి కనిపించాడని పోలీసు అధికారులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతుడి తండ్రి తన కొడుకు 2003లో వివాహం చేసుకున్నాడని, ఇప్పుడు విడాకులు తీసుకున్నాడని పేర్కొన్నాడు. ధీరజ్ కు ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. కూతురికి దాదాపు 19 సంవత్సరాలు, కొడుకుకు దాదాపు 14 సంవత్సరాలు. మృతుడికి ఒక వ్యాపారం ఉంది. అనుమానితులు ఎవరూ లేదా దుశ్చర్యకు సంబంధించిన ఆనవాళ్లు ఇంకా గుర్తించలేదని పోలీసులు చెబుతున్నారు. మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.






## దుబాయ్‌లో పాకిస్తానీ బిచ్చగాళ్ల దుకాణం క్లోజ్..

**బిచ్చగాడి నుండి లక్షల రూపాయలు స్వాధీనం**

రంజాన్ పండుగకు ముందు, దుబాయ్‌లో పోలీసులు యాచకులపై భారీ చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా విదేశాల నుండి వచ్చే వారిని వారు పర్యవేక్షిస్తున్నారు. ఈ క్యాంపెయిన్ లో లక్షల విలువైన ఆస్తి, మూడు లగ్జరీ కార్ల యజమానిగా మారిన ఒక యాచకుడిని పట్టుకున్నారు. నేర సంఘటనల విభాగం డైరెక్టర్ బ్రిగేడియర్ అలీ సలేం అల్ షంసి ప్రకారం, కొంతమంది డబ్బు సంపాదించడానికి ప్రజల దాతృత్వాన్ని దోపిడీ చేస్తారు. మార్కెట్లో జరిగిన దాడిలో, ఒక బిచ్చగాడి చాప కింద నుండి 25,000 దిర్హామ్‌లు (సుమారు 600,000 రూపాయలు) స్వాధీనం చేసుకున్నారు. అదనంగా, టూరిస్ట్ వీసాపై వచ్చిన ఒక ఆసియా వ్యక్తి నుండి రూ.500,000 స్వాధీనం చేసుకున్నారు. అతను మసీదుల దగ్గర భిక్షాటన చేసి, సానుభూతి పొందడానికి తన రెండేళ్ల బిడ్డను తన వెంటే పెట్టుకున్నాడు. ార్జా పోలీసులు యాచకుల సంపాదనను అంచనా వేయడానికి ఒక టెస్ట్ నిర్వహించారు. ఒక గంటలో, వారు 367 దిర్హామ్‌లు (సుమారు 9,000 రూపాయలు) వసూలు చేశారు. అధికారుల ప్రకారం, అరెస్టు చేయబడిన వారిలో 90% మంది రంజాన్ సమయంలో సులభంగా డబ్బు సంపాదించడానికి వచ్చే పర్యాటకులు ఉన్నట్లు తేలింది. పాకిస్తాన్‌లోని వ్యవస్థీకృత ముఠాలు విమాన టిక్కెట్లు, వీసాలు అందించడం ద్వారా ప్రజలను దుబాయ్‌కు పంపుతున్నాయని నివేదికలు వెల్లడించాయి. వీరిలో ఎక్కువ మంది సింధ్ ప్రావిన్స్‌కు చెందినవారు.

# బంగ్లాదేశ్ నయా సారథి తారిఖ్ రెహమాన్‌కు మమతా బెనర్జీ సర్ప్రైజ్ గిఫ్ట్..



బంగ్లాదేశ్‌లో తాత్కాలిక సారథి యూనస్ శకం ముగిసింది. తాజాగా జరిగిన 13వ జాతీయ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఆసక్తి రేపాయి. ఈ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేత తారిక్ రహ్మాన్ ఘన విజయం సాధించారు. ఇప్పటికే మన దేశ ప్రధాని మోడీ తారిక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అయితే.. బంగ్లాదేశ్ పొరుగు రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ (ఛ్రుఎఘ్ను ధ్రుఅవతీయవవ) తారిక్‌కు గిఫ్ట్ పంపారు. ప్రత్యేకంగా పూలు, మిఠాయిలు పంపించి అభినందనలు తెలిపారు. ఈ బహుమతులను ఢాకాలోని గుల్షన్‌లోని పార్టీ కార్యాలయంలో బీఎన్‌పీ ప్రతినిధులు స్వీకరించారు. ఇదివరకే ఆమె సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. బంగ్లాదేశ్ ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, రమజాన్ శుభాకాంక్షలు ముందుగానే చెప్పారు. తారిక్ రహ్మాన్‌ను "తారిక్ భాయ్" అని పిలుస్తూ.. పార్టీ విజయంపై ప్రత్యేక అభినందనలు చెప్పారు. రెండు దేశాల మధ్య సంబంధాలు ఇలాగే బలంగా కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. బంగ్లాదేశ్‌లో ఎన్నికల ప్రక్రియ గురువారం ముగిసింది. అనంతరం బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం 300 స్థానాల్లో 297 స్థానాల ఫలితాలను అధికారికంగా ప్రకటించింది. అందులో బీఎన్‌పీ, దాని మిత్రపక్షాలు కలిసి 212 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన ఆధిక్యం సాధించాయి. జమాత్-ఎ-ఇస్లామీ ఆధ్వర్యంలోని 11 పార్టీల కూటమి 77 స్థానాలు గెలుచుకుంది. ఇస్లామీ ఆందోళన్ బంగ్లాదేశ్ ఒక స్థానం దక్కించుకోగా, స్వతంత్ర అభ్యర్థులు ఏడు స్థానాల్లో విజయం సాధించారు. ఈ ఫలితాలతో బంగ్లాదేశ్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలైనట్టైంది. ఒకవైపు పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి వచ్చిన ఆప్యాయ శుభాకాంక్షలు, మరోవైపు భారత ప్రధాని అభినందనలు తెలపడం ఆసక్తికరంగా మారింది. భారత్‌బంగ్లాదేశ్ సంబంధాల కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.



# రూ.500 కంటే తక్కువ.. 72 రోజుల వ్యాలిడిటీ

భారతదేశంలో టెలికాం రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్-ఐడియా, బీఎస్ఎన్ఎల్ కంపెనీలు తమ అగ్రస్థానాలను దక్కించుకోవడానికి వివిధ ప్రీపెయిడ్ పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌లను ఎప్పటికప్పుడు ప్రవేశపెడుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగానే ప్రభుత్వ యాజమాన్యంలోని టెలికామ్ సంస్థ బీఎస్ఎన్ఎల్ ఇప్పుడు తాజాగా 72 రోజుల ప్లాన్ తీసుకొచ్చింది. పోర్ట్‌ఫోలియోలో అత్యుత్తమ ప్రీపెయిడ్ ప్లాన్‌లలో ఒకటి రూ. 500 కంటే తక్కువ ధరకే లభిస్తుంది. ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలున్నాయని సంస్థ తెలిపింది.

**రూ.485 ప్రీపెయిడ్ ప్లాన్**

బీఎస్ఎన్ఎల్ పరిచయం చేసిన ఈ రూ.485 ప్రీపెయిడ్ ప్లాన్ ద్వారా.. యూజర్ అపరిమిత కాల్స్, రోజుకు 2జీబీ డేటా, 100 ఎస్ఎమ్ఎస్/రోజుకు లభిస్తాయి. ఈ ప్యాక్ వ్యాలిడిటీ 72 రోజులు మాత్రమే.

**ఇప్పటికే రూ.251 రీఛార్జ్ ప్లాన్**

బీఎస్ఎన్ఎల్ స్టూడెంట్ ప్లాన్ పేరుతో పరిచయం చేసిన ఈ రీఛార్జ్ ప్లాన్ ధర రూ. 251 మాత్రమే. వ్యాలిడిటీ 28 రోజులు. అంటే రోజుకు 8.96 రూపాయలన్నమాట. ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకుంటే.. ఉచిత కాలింగ్, డేటా, ఎస్ఎమ్ఎస్ ప్రయోజనాలు లభిస్తాయి. ఈ ప్లాన్ పరిమిత కాలం మాత్రమే (నవంబర్ 14 నుంచి డిసెంబర్ 14 వరకు) అందుబాటులో ఉంటుంది. 28 రోజులు అపరిమిత కాల్స్ మాత్రమే కాకుండా 100జీబీ హైస్పీడ్ డేటా, రోజుకు 100 ఎస్ఎమ్ఎస్‌లు పొందవచ్చు. ఇది బీఎస్ఎన్ఎల్ కస్టమర్లందరికీ అందుబాటులో ఉంటుంది. ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకోవాలనుకునే కస్టమర్లు.. బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను సందరించడం ద్వారా, అధికారిక వెబ్‌సైట్ ద్వారా రీఛార్జ్ చేసుకోవచ్చు.

# ఈ-స్కూటర్లకు హోండా గుడ్‌బై!



న్యూఢిల్లీ:యాక్టివా ఎలక్ట్రిక్ స్కూటర్‌కు హోండా గుడ్‌బై పలుకబోతున్నదా అంటే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తున్నది. ఎంతో ఆర్భాటంగా దేశీయ మార్కెట్లో ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసిన జపాన్ వాహన సంస్థ హోండా..ఈ స్కూటర్‌కు డిమాండ్ బాగానే ఉన్నప్పటికీ గడిచిన నాలుగు నెలలుగా ఉత్పత్తిని నిలిపివేసినట్టు తెలుస్తున్నది. దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయం బట్టబయలు అయింది.ఈ ఏడాది ఆగస్టు నెల నుంచి ఇప్పటి వరకు ఉత్పత్తిని నిలిపివేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూలై వరకు ఆరు నెలలపాటు 11,168 యూనిట్ల ఎలక్ట్రిక్ యాక్టివా ఈ, క్యూసీఐ మాడళ్లను ఉత్పత్తి చేసింది. వీటిలో సగం 5,201 యూనిట్లను డీలర్లకు డెలివరీ చేసింది. విక్రయాలు ఆ స్థాయిలో లేకపోవడంతో ఉత్పత్తిని నిలిపివేసినట్టు తెలుస్తున్నది. ఈ 5,201 యూనిట్లలో 4,461 యూనిట్లు క్యూసీఐ మాడల్ కాగా, మిగతా 740 యాక్టివా ఈ మాడల్ మాత్రమే.తన బ్రాండ్ నుంచి తొలి ఈ-స్కూటర్ ఇదే కావడం విశేషం. ప్రస్తుతం హోండా యాక్టివా ఈ స్కూటర్ ధర రూ.1.17 లక్షలు కాగా, క్యూసీ1 మాడల్ ధర రూ.90,022గా నిర్ణయించింది. సింగిల్ చార్జింగ్‌లో 102 కిలోమీటర్ల వరకు ప్రయాణించనున్నది. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న ఈ స్కూటర్ల ధరల్లో ఇదే తక్కువ అయినప్పటికీ కొనుగోలుదారులు పెద్దగా ఆసక్తి చూపకపోవడం విశేషం. ప్రస్తుతం మార్కెట్లో హోండా స్కూటర్లతోపాటు బజాజ్, టీవీఎస్, ఏథర్, ఓలా, హీరో మోటోకార్ప్‌లు పలు మాడళ్లను విక్రయిస్తున్నాయి.

# వ్యవస్థీకృత లీకేజీలతో బీమాకు దెబ్బ

మోసం, వృథా, పాలసీ ఉల్లంఘనలు తదితర వ్యవస్థీకృత లీకేజీలతో దేశీయ బీమా రంగం ఏటా రూ.10,000 కోట్ల మేర నష్టపోతున్నదని ఓ తాజా రిపోర్టు వెల్లడించింది. దీంతో బీమా రంగంలో విశ్వసనీయత నిశ్శబ్దంగా అంతరించిపోతున్నదని సదరు నివేదిక పేర్కొన్నది.బీమా సంస్థలు, కార్పొరేట్లు, ప్రభుత్వం, రెగ్యులేటర్లు దీనిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని తెలిపింది.

# బీమా రంగంలోకి విదేశీ పెట్టుబడుల వరద

న్యూఢిల్లీ: బీమా రంగంలోకి విదేశీ పెట్టుబడులకు ఇక లైన్‌క్లియర్ అయింది. గతంలో 74 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించిన నరేంద్ర మోదీ సర్కార్ ఇక నుంచి 100 శాతం ఎఫ్‌డీఐలకు పచ్చజెండా ఊపింది. డిసెంబర్ 1 నుంచి అదే నెల 19 వరకు 15 రోజుల పాటు సాగనున్న శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఈ ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టబోతున్నది. ఇప్పటికే సంప్రదింపులు పూర్తయ్యాయని, బీమా చట్టం(సవరణ) బిల్లు 2025 ప్రవేశపెట్టబోతున్నట్టు లోక్‌సభ బులిటెన్‌లో వెల్లడించింది.బీమా రంగ పరిమితిని పెంపొందించడంతోపాటు వృద్ధి, అభివృద్ధిని వేగవంతం చేయడం, బీమా రంగ సంస్థల వ్యాపారాన్ని మరింత సులభతరం చేయాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ ప్రసంగంలో బీమా రంగంలోకి వచ్చే ఎఫ్‌డీఐల పరిమితిని 74% నుంచి 100 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించారు.

**82 వేల కోట్ల ఎఫ్‌డీఐలు**

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్శించడంలో దేశీయ బీమా రంగం దూసుకుపోతున్నది. ఇప్పటి వరకు ఈ రంగంలోకి రూ.82 వేల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. ఎఫ్‌డీఐల పరిమితిని పెంచడం,




సరళీకృత వ్యాపార విధానాలు, బీమా చట్టం-1938లో భారీ మార్పులు చేయడం కలిసొచ్చింది. బీమా చట్టం 1938ని పలుమార్లు సవరించింది. జీవిత బీమా కార్పొరేషన్ చట్టం 1956, బీమా నియంత్రణ-అభివృద్ధి ఆథార్టీ చట్టం 1999 ప్రకారం సవరించింది. ఇదే క్రమంలో దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ తన వ్యాపారాన్ని విస్తరించడానికి కూడా అనుమతిచ్చింది. ప్రతిపాదిత సవరణ ప్రధానంగా పాలసీదారుల ప్రయోజనాలను ప్రోత్సహించడం, వారి ఆర్థిక భద్రతను పెంపొందించడం, బీమా మార్కెట్లోకి అదనపు భాగస్వాముల ప్రవేశాన్ని సులభతరం చేయడం, తద్వారా ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనకు దోహదపడుతుంది. ఇతర రంగాల మాదిరిగానే బీమా రంగం పలు సవాళ్లను ఎదుర్కొన్నది.



# ప్రపంచంలో ఎక్కువ కార్లు ఉన్న దేశాలు

ఎద్దుల బండ్లు, గుర్రాలను ప్రయాణానికి ఉపయోగించిన మానవుడు.. నేడు విమానంలో ప్రయాణించేదాకా ఎదిగాడు. ఈ మధ్య కాలంలో కార్లు, బైకులు లెక్కలేనన్ని అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు ఇంటికి ఒక వాహనం ఉండేది, కానీ నేడు ఒక్కక్కరికి ఒక్కో వాహనం అన్నట్టు పరిస్థితులు మారిపోయాయి. కొన్ని దేశాల్లో వాహనాలు దాదాపు జనాభా సంఖ్యకు దగ్గరగా ఉన్నాయి. ఈ కథనంలో ఎక్కువ కార్లు ఏ దేశాల్లో ఉన్నాయో చూసేద్దాం..

న్యూజిలాండ్: సుమారు 869 కార్లు / 1000 మంది
అమెరికా (%ఖూూ%): సుమారు 860 కార్లు / 1000 మంది
పోలాండ్: సుమారు 761 కార్లు / 1000 మంది
ఇటలీ: సుమారు 756 కార్లు / 1000 మంది
ఆస్ట్రేలియా: సుమారు 737 కార్లు / 1000 మంది
కెనడా: సుమారు 707 కార్లు / 1000 మంది
ఫ్రాన్స్: సుమారు 704 కార్లు / 1000 మంది

భారతదేశంలో 1000 మందికి సరాసరిగా 34 కార్లు %ఁ% 1000 మందికి 185 ద్విచక్ర వాహనాలు మాత్రమే ఉన్నట్లు సమాచారం. పైన వెల్లడించిన దేశాల వరుసలో చూస్తే.. ఇండియా చాలా దూరంలో ఉంది.

# రీకాల్ ప్రకటించిన కేటీఎం

కేటీఎం కంపెనీ తన 2024 లైనప్ బైకులకు ప్రపంచవ్యాప్తంగా రీకాల్ ప్రకటించింది. ఇందులో 125 డ్యూక్, 250 డ్యూక్, 390 డ్యూక్, 990 డ్యూక్ వంటివి ఉన్నాయి. ఫ్యూయెల్ ట్యాంక్ క్యాప్ సీల్స్ చిన్న పగుళ్లు ఏర్పడవచ్చు. దీనివల్ల పెట్రోల్ లీక్ అయ్యే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకునే కంపెనీ రీకాల్ జారీ చేసింది.2024 మోడళ్లను కొనుగోలు చేసిన కేటీఎం బైక్ వినియోగదారులు.. ఈ సమస్యను ఉచితంగానే పరిష్కరించుకోవచ్చు. దీనికోసం వారు కంపెనీ అధీకృత సేవా కేంద్రాలను సందర్శించాల్సి ఉంటుంది. దీనికోసం బైకర్స్ ప్రత్యేకంగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు.

బజాజ్ ఆటో చేతికి కేటీఎమ్

దేశీ ద్విచక్ర వాహన దిగ్గజం బజాజ్ ఆటో తాజాగా ఆస్ట్రియన్ బైక్ కంపెనీ కేటీఎమ్‌లో మెజారిటీ వాటా సొంతం చేసుకుంది. 80 కోట్ల యూరోల(రూ. 7,765 కోట్లు) విలువైన ఒప్పందానికి యూరోపియన్ నియంత్రణ సంస్థల నుంచి అనుమతి పొందడం ద్వారా అదనపు వాటాను కొనుగోలు చేసినట్లు బజాజ్ ఆటో తెలియజేసింది.



# ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ ఇచ్చే బ్యాంకులు

పెట్టుబడి సురక్షితంగా ఉండాలనుకునే పెట్టుబడిదారులు.. ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఇన్వెస్ట్ చేస్తారు. ఇక్కడ మీ డబ్బు సురక్షితంగా ఉండటమే కాకుండా, స్థిర రాబడి కూడా పొందవచ్చు. అయితే ఇందులో పెద్ద మొత్తంలో లాభం రాకపోయినా.. నష్టం మాత్రం ఉండదు. అయితే మీకు వచ్చే రాబడి వివిధ బ్యాంకులు అందించే వడ్డీ రేట్ల మీద ఆధారపడి ఉంటుంది. ఈ కథనంలో ఏ బ్యాంక్ ఎంత వడ్డీ ఇస్తుందో తెలుసుకుందాం.

సాధారణంగా వడ్డీ రేట్లలో పెద్దగా తేడా ఉండదు, కానీ 50 బేసిస్ పాయింట్ల చిన్న వ్యత్యాసం కూడా మీ పెట్టుబడిని గణనీయంగా పెంచుతుంది. లాభం అనేది ముఖ్యంగా పెట్టుబడి పెట్టిన మొత్తం గణనీయంగా ఉన్నప్పుడు కాలపరిమితి ఎక్కువగా ఉన్నప్పుడు ఆశించవచ్చు.

**ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లు**

%ఎణఖీజ% బ్యాంక్: ఈ బ్యాంక్ సాధారణ పౌరులకు మూడేళ్ల కాలపరిమితి డిపాజిట్‌పై 6.45%, సీనియర్ సిటిజన్లకు 6.95% అందిస్తుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ అనేది 18 నెలల నుంచి 21 నెలల మధ్య కాలపరిమితి ఉన్నప్పుడు ఈ బ్యాంక్ కొంత ఎక్కువ వడ్డీ అందిస్తుంది.

ఈ ప్రైవేట్ రంగ బ్యాంకు.. సాధారణ పౌరులకు మూడేళ్ల కాలపరిమితి గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 6.6% వడ్డీని, సీనియర్ సిటిజన్లకు 7.2% వడ్డీని అందిస్తుంది.

**కోటక్ మహీంద్రా బ్యాంక్:** ఇది మూడు సంవత్సరాల కాలపరిమితి కలిగిన సాధారణ పౌరులకు 6.4%,




సీనియర్ సిటిజన్లకు 6.9% వడ్డీని అందిస్తుంది. అయితే, 391 రోజుల నుంచి రెండు సంవత్సరాల కంటే తక్కువ కాలపరిమితి కలిగినప్పుడు.. బ్యాంక్ అత్యధికంగా 6.7%, 7.2% వడ్డీని అందిస్తుంది.

**ఫెడరల్ బ్యాంక్:** ఈ ప్రైవేట్ రంగ బ్యాంకు తన మూడు సంవత్సరాల డిపాజిట్లపై సాధారణ పౌరులకు 6.7% %ఁ% సీనియర్ సిటిజన్లకు 7.2% వడ్డీని అందిస్తుంది. అత్యధిక వడ్డీ ఇచ్చే బ్యాంకుల జాబితాలో ఇది ఒకరి కావడం గమనార్హం.స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారతదేశంలోని అతిపెద్ద బ్యాంకు అయిన.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన మూడేళ్ల డిపాజిట్లపై సాధారణ పౌరులకు 6.3% వడ్డీని %ఁ% సీనియర్ సిటిజన్లకు 6.8% వడ్డీని అందిస్తుంది. రెండు, మూడు సంవత్సరాల మధ్య కాలపరిమితి ఉన్నప్పుడు కొంత ఎక్కువ వడ్డీ (6.45% %ఁ% 6.95%) అందిస్తుంది.

**కెనరా బ్యాంక్:** ఈ బ్యాంక్ మూడు సంవత్సరాల డిపాజిట్లపై సాధారణ పౌరులకు 6.25% %ఁ% సీనియర్ సిటిజన్లకు 6.75 వడ్డీని ఇస్తుంది. అయితే, 444 రోజుల కాలపరిమితి ఉన్నప్పుడు అత్యధిక రేట్లు (6.5%%& 7%) పొందవచ్చు.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా: ఇది మూడు సంవత్సరాల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై సాధారణ పౌరులకు 6.6% %ఁ% సీనియర్ సిటిజన్లకు 7.1% వడ్డీని అందిస్తుంది.